‘జగనన్న ఆరోగ్య సురక్ష’కు మంగళం

- గత ప్రభుత్వంలో ఇంటింటా ఉచిత వైద్య సేవలు
- పథకాన్ని గాలికొదిలేసిన కూటమి సర్కార్
- ఆసుపత్రుల చుట్టూ తిరగలేక దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బందులు



ఇంటి వద్ద వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది (ఫైల్)

మంగళగిరి: ప్రజలకు ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యం అందించగలిగితే సమాజం అభివృద్ధి చెందుతుందని నమ్మిన మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన పాలనలో ఇంటింటా వైద్య సేవలను ఏర్పాటు చేశారు. పేద ప్రజలకు వైద్యం ఇంటి వద్దనే అందించాలని ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ పేరుతో కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి ఇంటికీ వైద్య సిబ్బంది వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి సేవలందించేవారు. ప్రతి నెలా తమ ఏరియాలో నిపుణులైన వైద్యులు, సిబ్బంది వచ్చి 14 రకాల వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు, అవసరమైన మందులు పూర్తిగా ఉచితంగా అందించేవారు. మెరుగైన వైద్యం అవసరమైతే సమీపంలోని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఉన్న ఆసుపత్రికి తరలించేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ సేవలన్నిటికీ మంగళం పాడింది. దీంతో అనారోగ్యం వస్తే ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు.

పట్టించుకోని ప్రజారోగ్యం..

నెల రోజులుగా ఎండలు అధికంగా పెరగడంతో వడదెబ్బతో పాటు పలు వ్యాధులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నియోజకవర్గంలోని 9 అర్బన్ పి.హెచ్.సిలు, మూడు ప్రభుత్వాసుపత్రులు ఉన్నాయి. వీటిలో రోజుకు 350 నుంచి 400 మంది వైద్య పరీక్షల కోసం వస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ కొరవడడం, దోమల బెడద అధికం కావడం, తీవ్రమైన ఎండల నేపథ్యంలో వృద్ధులు, చిన్నారులు వాంతులు, విరేచనాలు, జ్వరాల వంటి వ్యాధులతో బాధపడుతున్నారు. ఆసుపత్రులకు రాలేని వారి పరిస్థితి దయనీయంగా మారింది. దీంతో కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని పట్టించుకోకపోవడంతో పల్లెవైద్యం పడకేసింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష పేరుతో వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శస్త్రచికిత్సలు అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా చేయించుకునేందుకు కార్పొరేట్ ఆసుపత్రులకు పంపేవారు. గుండె సంబంధిత వ్యాధి రోగులకు ఈసీజీ తీసేవారు. దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారికి నాణ్యమైన వైద్య సేవలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. కానీ.. కూటమి సర్కారు ప్రస్తుత ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసింది.



గత ప్రభుత్వంలో పల్లెల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం (ఫైల్)

గతంలో ఇంటివద్దే పరీక్షలు..



గత వైఎస్సార్ సీపీ పాలనలో నెలకోసారి ఏఎన్ఎంలు ఇంటికి వచ్చి బీపీ, షుగర్ లాంటి పరీక్షలు ఉచితంగా చేసేవారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు ఇచ్చేవారు. ఇంటి దగ్గరలోనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో వృద్ధులు, దివ్యాంగులు, పిల్లలు ఇబ్బంది లేకుండా వైద్య సేవలందుకునేవారు. గత ఏడాది కాలంగా ఆరోగ్యం గురించి ఆరా తీసిన వారే లేరు.

– కె.లక్ష్మి, మంగళగిరి

ఇబ్బందులు పడుతున్నాం..



గతంలో నర్సులు ఇంటికి వచ్చి పరీక్షలు నిర్వహించి మందులిచ్చేవారు. ఇప్పుడు ఎవరికైనా ఆరోగ్యం బాగాలేకపోతే ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతి నెలా నర్సులు వచ్చి ఆరోగ్యం తెలుసుకొని పరీక్షలు చేసి మందులిచ్చేవారు. గత ఏడాది కాలంగా నర్సులు కూడా రావడం లేదు. దీంతో అనారోగ్యాల బారిన పడిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– ఎస్.కె రెహమున్నీ, మంగళగిరి

మే 20న జరిగే సమ్మెను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ట్రేడ్ యూనియన్ నాయకులు

తాడేపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మే నెల 20వ తేదీన నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అఖిల పక్ష ట్రేడ్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం తాడేపల్లిలోని కె.సి వర్క్స్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి సి.ఐ.టి.యు నాయకులు బూరగ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని మండిపడ్డారు. అందులో భాగంగా వినాశకరమైన నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు. 8 గంటల పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మే 20వ తేదీ జరుగనున్న జాతీయ సమ్మెలో తాడేపల్లి ప్రాంతంలో ఉన్న కార్మిక వర్గం మొత్తం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సి.ఐ.టి.యు నాయకులు వేముల దుర్గారావు, ఎ.ఐ.టి.యు.సి నాయకులు టి.వెంకటయ్య, ఎ.ఐ.ఎఫ్.టి.యు(న్యూ) నాయకులు ఆదినారాయణ, ఐ.ఎ న్.టి.యు.సి నాయకులు దర్శనపు సామేలు, ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ నాయకులు కూరపాటి స్టీవెన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మెల్ కొండపై ప్రార్థనలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై ఉన్న కార్మెల్‌మాతను దర్శించుకునేందుకు ఆదివారం పలు ప్రాంతాల నుంచి విశ్వాసులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయాన్నే బస్సులు, రైళ్ల ద్వారా వచ్చిన విశ్వాసులు కొండను ఎక్కి మొక్కులు సమర్పించారు. అనంతరం కార్మెల్ మాతను దర్శించుకుని కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. కొండ దిగువన ఉన్న కార్మెల్ మాత స్వరూపం వద్ద కూడా మొక్కులు చెల్లించుకున్నారు.

చర్చికి గ్రానైట్ అందజేత

చినకాకాని(మంగళగిరి): చినకాకానిలో నిర్మాణం జరుగుతున్న పునీత జోషెఫ్ చర్చికి రాష్ట్ర మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ గ్రానైట్ అందజేశారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు లోకేష్ రూ.7 లక్షలు విలువ చేసే గ్రానైట్‌ను ఆదివారం స్థానిక నాయకుల ద్వారా చర్చి నిర్వాహకులకు అందజేశారు. చర్చి ఫాదర్ చిన్నపరెడ్డి, సంఘ పెద్దలు మంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో టి.డి.పి నాయకులు గుమ్మా హరిబాబు, పలగాని నాగబాబు, పాన్నెగంటి సాంబశివరావు, నక్కా సాంబశివరావు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సమ్మర్ క్యాంప్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి షేక్ నాగూర్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంప్‌లో రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు పిల్లలకు పుస్తకాలు చదవడం, రాయడం, సాంస్కృతిక కార్యక్రమాలు, స్పోకెన్ ఇంగ్లీష్, అల్లికలు వంటి వాటిపై రీసోర్స్ పర్సన్స్‌తో శిక్షణ ఇస్తామని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయానికి పంపించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వేసవి శిక్షణ ప్రారంభం నేడు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలీ శాఖా గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఉత్తర్వుల మేరకు విద్యార్థులకు సోమవారం నుంచి వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ ఇన్‌చార్జి పి.జేమ్స్ ఆదివారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యార్థులకు పలు అంశాలపై నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ శిక్షణ తరగతులను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ డి.ఇ. సురేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి 11.30 గంటల వరకు కె.వి విద్యుత్ లైన్ల మరమ్మత్తుల నిమిత్తం రత్నాలచెరువు, కొండపనేని టౌన్‌షిప్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉగ్రదాడిలో మరణించిన వారికి నివాళి



ర్యాలీలో సీపీఎం నాయకులు

దుగ్గిరాల: ఉగ్రదాడిలో అసువులుబాసిన 28 మంది టూరిస్టుల వారి ఆత్మకు శాంతి కలగాలని రైలుపేట బోసు బొమ్మ సెంటర్ వద్ద ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. సీపీఎం కార్మిక సంఘం జిల్లా నాయకులు జెట్టి బాలరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పహల్గాంలో టూరిస్టులపై ఉగ్రవాదులు కాల్పులు జరపడం దారుణమని నాయకులు అన్నారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో జి.శ్రీనివాసరావు, టి.వెంకటనారాయణ, ఏడుకొండలు, ఆశీర్వాదం, ఖాసీంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



దంతలూరులో భగవద్గీత ప్రచారం

దంతులూరు(తెనాలి): ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు దివ్య ఆశీస్సులతో ‘త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక’ గుంటూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం కొల్లిపర మండలంలోని దంతులూరు గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం జరిగింది. గ్రామస్తులకు గురువు రచించిన 101 త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల గురించి వివరించి గ్రామస్తులకు వివరించి, వారి జీవితంలో జ్ఞానమార్గాన్ని అనుసరించాలని కోరారు. పౌర్ణమి అనేది పూర్ణ దైవ జ్ఞానానికి, అమావాస్య అజ్ఞానానికి గుర్తు అయినందున అజ్ఞానం నుంచి వెలుగు వైపునకు అంటే దైవజ్ఞానం వైపు ప్రయాణించాలని సూచించారు. అమావాస్యకు పౌర్ణమికి మధ్యలో అష్టమి తిథి రోజున శ్రీకృష్ణుడు జన్మించి జ్ఞానం అజ్ఞానానికి మధ్యలో వారధిలా కనిపిస్తాడని చెబుతూ శ్రీకృష్ణుడిని విశ్వసిస్తే పౌర్ణమివైపు నడిచి, జ్ఞానం తెలుసుకుని మోక్షం అందుకోవచ్చని తెలిపారు. శ్రీకృష్ణుడిని, భగవద్గీతను విశ్వసించకపోతే అమావాస్యవైపు నడచి అజ్ఞానంలో మునిగి మోక్షం పొందలేరని చెప్పారు. ప్రచారంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి-ఇందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు, సభ్యులు టీవీ కృష్ణారావు, ఆర్.రామకృష్ణ, బి.శివలింగం నాయక్, టి.బ్రహ్మం, శ్రీను, బి.రామోజీనాయక్, జె.హరిబాబు, సుబ్బారావు, ఎస్‌కే దిల్షా, అన్నపూర్ణ, చంద్రిక పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కార్యక్రమంలో గురువులు, పూర్వ విద్యార్థులు

మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల ఎస్.జి.వి.ఆర్ హైస్కూల్‌లో 2003-04 ఏడాదిలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. వృత్తి రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన వీరంతా ఇప్పుడు మళ్లీ చదువులమ్మ ఒడికి చేరి అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 21 ఏళ్ల తర్వాత అందరూ కలిసి ఉత్సాహంగా గడిపారు. ఒకరి యోగక్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్య నేర్పిన గురువులు కోటేశ్వరరావు, కొండవీటి రాజేంద్రప్రసాద్, కొడాలి లావణ్య, బైరపనేని లక్ష్మి, సునీత, ఇందిరాదేవి, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, రమాదేవి, శ్రీనివాసరావు ఇతర గురువులను ఘనంగా సత్కరించారు. విందు భోజనాలు చేసి ఆటపాటలతో ఉషారుగా గడిపారు.

వైద్యశిబిరంలో 200 మందికి పరీక్షలు



తెనాలి: పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతినెల చివరి ఆదివారం జరిగే ఉచిత షుగరు వైద్యశిబిరాన్ని ఈ ఆదివారం బుర్రిపాలెంరోడ్డులోని డాక్టర్ ఎస్.భవనంలో నిర్వహించారు. సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద ఆధ్వర్యంలో ఏర్పాటైన శిబిరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 200 మంది రోగులకు ఉదయం అయిదు గంటల నుంచి షుగరు, బీపీ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఈసీజీ, థైరాయిడ్ పరీక్షలు కూడా చేశారు. షుగర్ పరీక్షలకు ముందు తర్వాత రెండు రకాల అల్పాహారాలు అందించారు. నెలకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. అనంతరం రోగులకు ఆహారం, వ్యాయామం ప్రాధాన్యతపై డాక్టర్ శారద అవగాహన కల్పించారు. క్యాంపులో 20 మంది వలంటీర్లు సహకారం అందించారు.


క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



తాడేపల్లి రూరల్: పట్టణ పరిధిలోని అమరావతి ఐకాన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐకాన్ క్లబ్‌హౌస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. విజయవాడ స్రవంతి హాస్పటల్ వైద్యులు డాక్టర్ విజయ శ్రీనివాస్, డాక్టర్ రవికుమార్, సిబ్బంది అపార్ట్ మెంట్ వాసులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారని తెలిపారు. ఎముకలు, కీళ్లు, వెన్నుపూస సమస్యలు, స్త్రీ, ప్రసూతి, లాపరోస్కోపి సేవలు, బి.పి, షుగర్, థైరాయిడ్, జనరల్ వైద్య సేవలు, గుండె సమస్యలు, వివిధ రకాల రోగాలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు అందజేశారని అన్నారు. ఈసీజీ, ఏకో, కంటి శుక్లాల పరీక్షలు, రక్త పరీక్షలు తదితర పరీక్షలు ఉచితంగా ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో అమరావతి ఐకాన్ అధ్యక్షులు ఎం.వినోద్ కుమార్, సెక్రటరి ఎస్.కె రియాజ్ బాషా, ట్రెజరర్ యు.రాజశేఖర్, విక్రమ్, ప్రకాష్, రమేష్, వి.స్వాములు, లక్ష్మీ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణకు క్రీస్తు పునరుత్థానం



ఫిరంగిపురం: ప్రజల రక్షణ కోసం క్రీస్తు పునరుత్థానం పొందినట్లు విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో ఆదివారం క్రీస్తు పునరుత్థాన ప్రార్థన కార్యక్రమం నిర్వహించారు. ఆయన వాక్యోపదేశం చేస్తూ.. శిలువ వేసిన తరువాత మరణించిన క్రీస్తు మూడు రోజుల తరువాత పునరుత్థానం పొందాడన్నారు. ప్రభువు పునరుత్థానాన్ని విశ్వాసులు విశ్వసించాలని అన్నారు. భక్తి, ప్రేమ, విశ్వాసం ద్వారా దేవుడు మన దగ్గరగా ఉండి కష్టాలను దూరం చేస్తారని తెలిపారు. అనంతరం దివ్యపూజాబలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మఠకన్యాస్త్రీలు, గుడిపెద్దలు, కథోలిక క్రైస్తవులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు బహుమతులు



మంగళగిరి టౌన్: పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను చూపిన విద్యార్థులకు ఆదివారం బహుమతులు అందజేశారు. మంగళగిరి నగరానికి చెందిన రచ్చబండ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం వద్ద విద్యార్థులకు ఆర్టికల్ బహుమతులను అందజేశారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో మరింత ముందుకు వెళ్లాలని.. భావి తరాలకు ఆదర్శంగా నిలవాలని పలువురు కొనియాడారు. ఆస్థాన పండిత శివాలయ అర్చక పురోహితులు టి.శ్యామ్ సుందర్ శాస్త్రి విద్యార్థులకు వేదమంత్రాలతో ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు రామకృష్ణ, దేవతి భగవన్నారాయణ, రచ్చబండ ఫ్రెండ్ సర్కిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక వర్గాన్ని ఆపాదించడం సరికాదు

దుగ్గిరాల: పహల్గాంలో పాకిస్తాన్ ముష్కరుల దాడిని ఒక సామాజిక వర్గం, మతానికి ఆపాదించి ముస్లిం మైనార్టీలను టార్గెట్ చేయడం.. దాడులకు పాల్పడడం తగదని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితీ నాయకుడు షేక్.సుభాని అన్నారు. ఆదివారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పహల్గాం దాడికి వ్యతిరేకంగా ఇస్లాంను నిందించడం దారుణమన్నారు. తీవ్రవాదానికి ప్రత్యేక కులం, మతం అంటూ ఉండవన్నారు. ముష్కరులరు కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. సమావేశంలో షేక్. జిలాని, షేక్.బాజి బాబా, షేక్.ఖాజా పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వ్యక్తులపై కేసు

తెనాలిరూరల్: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని కొలకలూరు గ్రామానికి చెందిన మల్లవరపు విజయ్, ఉన్నం రవి, మరి కొంతమంది శనివారం సాయంత్రం మద్యం సేవించి, గ్రామ పెద్ద కాల్వ వంతెన పైన స్కూలు, కాలేజీ బస్సులు, ఇతర వాహనాలకు అటకాయించి, వాహన డ్రైవర్లపై దురుసుగా ప్రవర్తించారు. అంతటితో ఆగకుండా వాహన రాకపోకలను సుమారు 30 నిమిషాలు అడ్డుకున్నారు. పబ్లిక్ స్థలంలో ప్రజలకు ఇబ్బంది కలిగించడంతో వారిపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ కె. ఆనంద్ ఆదివారం తెలిపారు.

సహచర విద్యార్థికి ఘనంగా సన్మానం



కృష్ణరాజేంద్ర దంపతులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

మంగళగిరి టౌన్: ప్రముఖ సైంటిస్ట్ నీలి కృష్ణరాజేంద్ర దేశం గర్వించే స్థాయికి ఎదిగారని మంగళగిరి సి.కె హైస్కూల్ 1982 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని శ్రీ భద్రావతి సమేత భావనాఋషి కల్యాణ మండపంలో ఆదివారం నీలి కృష్ణరాజేంద్రకు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. తమ బ్యాచ్ విద్యార్థి ప్రముఖ సైంటిస్ట్ నీలి కృష్ణరాజేంద్ర అధునాతన మధ్యస్త పోరాట విమానాలు రూపొందించడం, డిజైన్ చేయడం, నిర్మించడంలో ఆయన సాధించిన అద్భుత విజయాలకు గాను ఎంతో గర్వంగా ఉందన్నారు. ప్రస్తుతం ఆయన బెంగళూరులోని ఎరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజన్సీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్‌లో ఎ.ఎం.సి.ఎ. ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. 40 సంవత్సరాల క్రితం కలిసి చదువుతున్న తమ సహచర విద్యార్థి కృష్ణరాజేంద్ర దంపతులను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తాడికొండ తిరుమలరావు, రావెల శ్రీనివాసరావు, సీతారామప్రసాద్, డాక్టర్ తాడిపర్తి శ్రీనివాసరావు, దామర్ల కుబేరస్వామి, శ్రీకృష్ణ దేవరాయలు, ఉడతా వెంకటేశ్వర్లు, దామర్ల వీరాంజనేయులు, వాల్మీకి శ్రీనివాసరావు, దేవళ్ల పుల్లయ్యతో పాటు ముఖ్యఅతిథిగా టి.డి.పి శాసన సభ కమిటీ కార్యదర్శి కోనేరు సురేష్, గౌరవ అతిథిగా ప్రముఖ సాహితీవేత్త బండ్ల మాధవరావు పాల్గొన్నారు.

మానవ హక్కులను రక్షించే దిశగా పనిచేయాలి



సాయిచంద్‌ను సత్కరిస్తున్న సీపీఐ నాయకులు

మంగళగిరి టౌన్: అవినీతి, నేరాలను నిరోధించడంతో పాటు మానవ హక్కులను రక్షించే దిశగా పనిచేయాలని పలువురు సి.పి.ఐ నాయకులు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని తమ పార్టీ కార్యాలయంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అండ్ యాంటీ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమితులైన చదలవాడ సాయిచంద్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రజల్లో అవినీతి, నేరాల గురించి అవగాహన కల్పించాలన్నారు. మంగళగిరి పట్టణానికి చెందిన వ్యక్తి ఈ పదవి పొందడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు పొంది ప్రజలకు చేరువ కావాలని ఆకాంక్షించారు. ప్రజలకు హ్యూమన్ రైట్స్ సంస్థ తరపున అవసరమైన సేవలు అందిస్తానని సాయిచంద్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు చిన్ని తిరుపతయ్య, కంచర్ల కాశయ్య, అన్నవరపు ప్రభాకర్, జాలాది జాన్‌బాబు, నందం బ్రహ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సారూ.. ఐరన్ పోల్‌ను తొలగించరూ!



మలుపు వద్ద ప్రమాదంగా ఉన్న ఐరన్ పోల్

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని బాప్టిస్ట్ పేటలో ఐరన్ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారిందని స్థానికులు వాపోయారు. గతంలో ఇక్కడ ఉండే ఐరన్ కరెంట్ పోల్‌ను తొలగించి వాటి స్థానంలో సిమెంట్ పోల్స్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. అయితే ఐరన్ పోల్‌ను పూర్తిగా తొలగించకుండా కొంత భాగం వదిలివేయడంతో అది తప్పు పట్టి ప్రమాదకరంగా మారింది. రెండు రోడ్ల కూడలిలో ఈ పోల్ ఉండడం వల్ల ద్విచక్ర వాహనదారులు, సైకిల్ మీద వెళ్లే చిన్నారులు మలుపు తిరిగే క్రమంలో ఆ పోల్‌పై పడితే ప్రమాదం సంభవించవచ్చని స్థానికులు అంటున్నారు. ఆదివారం ద్విచక్రవాహనంపై వస్తున్న ఓ యువకుడు ఆ మలుపు ప్రాంతంలో అదుపుతప్పి పోల్ పక్కన పడ్డాడని, అదే పోల్‌పై పడివుంటే ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి మిగిలి ఉన్న ఐరన్ పోల్‌ను తొలగించాలని కోరుతున్నారు.

బాధితులకు అండగా రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన వారికి సర్టిఫికేట్స్ అందజేస్తున్న జనసేన నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి నులకపేటకు చెందిన తలసేమియా బాధితుడికి జనసేన నాయకులు అండగా నిలిచారు. ఆదివారం బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించి తలసేమియా బాలుడికి రక్తాన్ని సమకూర్చారు. ఈ సందర్భంగా జనసేన తాడేపల్లి రూరల్ అధ్యక్షులు సామల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్, జనసేన మంగళగిరి ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు తాడేపల్లిలో బ్లడ్‌బ్యాంక్, ప్రాతూరులో మెడికల్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నామని అన్నారు. తలసేమియాతో బాధపడుతున్న భరత్‌కు మూడేళ్లుగా బ్లడ్ డొనేషన్ క్యాంపులు నిర్వహించి ఏడాదికి సరపడా రక్తాన్ని దాతల ద్వారా అందజేస్తున్నామన్నారు. సుమారు 40 మంది ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారని.. వారికి సర్టిఫికేట్లు అందజేశామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు చవ్వాకుల కోటేష్‌బాబు, జొన్న రాజేష్, లాల్‌చంద్, మణికంఠ, నాని, ప్రశాంత్, ధనుంజయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సెమీస్‌కు ఆర్‌జే సీసీ టీం



క్రీడాకారులకు టీ షర్ట్స్ అందజేస్తున్న నాగేశ్వరరావు తదితరులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి దేవుని మాన్యం గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సూపర్‌లీగ్ టోర్నమెంట్‌లో రాజేష్ జొన్న సీసీ టీం ఆదివారం సెమీస్‌కు చేరింది. మ్యాచ్‌ను జనసేన తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, జనసేన రాష్ట ఐటీ విభాగం కోఆర్డినేటర్ చవ్వాకుల కోటేష్‌బాబు, సోషల్ వర్కర్ జొన్న రాజేష్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌లు విద్యార్థుల మనో వికాసానికి దోహదపడతాయని.. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందిస్తున్నామని అన్నారు. అనంతరం టీం సభ్యులకు టీ షర్ట్స్ అందజేశారు. రాజేష్ జొన్న సీసీ టీం కెప్టెన్ సాతుపాటి గోపీనాథ్ మాట్లాడుతూ.. తాడేపల్లి సూపర్‌లీగ్‌లో విన్నర్‌గా నిలిచి రూ.40 వేలు ప్రైజ్‌మనీ గెలవడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు లాల్‌చంద్, జీలగ కళ్యాణ్, విజయ, పసుపులేటి నరేష్, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

పద్ధతి మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవు

మంగళగిరి టౌన్: రౌడీషీటర్లు పద్ధతి మార్చుకోవాలని.. లేకుంటే పి.డి యాక్ట్ అమలు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని మంగళగిరి పట్టణ యస్ఐ హరిబాబు హెచ్చరించారు. మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా యస్ఐ హరిబాబు మాట్లాడుతూ.. నేర ప్రవృత్తిని మార్చుకోవడానికి అవకాశం ఇస్తున్నామని.. సన్మార్గంలో నడవాలని కోరారు. కేసులపాలుకాకుండా కుటుంబ సభ్యులతో కలసి సంతోషంగా జీవించాలన్నారు. రౌడీషీటర్ల నేరచరిత్ర, వారిపై ఉన్న కేసుల వివరాలు, ప్రస్తుత జీవన విధానం, స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో క్రైమ్ సిబ్బంది బాబూరావు, ఏడుకొండలు, సుధీర్, శ్రీరామ్ పాల్గొన్నారు.